క్లుప్తంగా

సీఎంకు ఘనస్వాగతం



మిడ్జిల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి గురువారం సాయంత్రం మండల ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు, తన సొంతూ కొండారెడ్డిపల్లి నుంచి గురువారం రాత్రి మిడ్జిల్ మీదుగా కారులో కొడంగల్‌కు బయలు దేరారు. మిడ్జిల్ మండల కేంద్రానికి వచ్చేసరికి అభిమానులు రోడ్డుకు అడ్డంగా వెళ్లి సీఎం వాహనాన్ని నిలిపారు. కారులో నుంచి అభిమానులకు చేయి ఊపుతూ సీఎం బయలుదేరారు.

వచ్చే ఏడాది మరింత భవ్యంగా దసరా ఉత్సవాలు

- ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల టౌన్: వచ్చే ఏడాది మరింత భవ్యంగా దసరా ఉత్సవాలు నిర్వహిస్తామని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ప్రకటించారు. పట్టణంలోని డిగ్రీ కళాశాల మైదానంలో గురువారం రాత్రి నిర్వహించిన దసరా వేడుకల్లో పాల్గొన్న ఆయన ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ప్రత్యేక విద్యుత్ దీపాలంకరణతో పట్టణంలో ముందుగానే పండగ వాతావరణం తీసుకొచ్చామని, ప్రజలకు బాణాసంచా పేలుళ్లతో వినోదం కలిపించామన్నారు. వేడుకలకు పట్టణ ప్రజలు పెద్దఎత్తున తరలిరావడం ఆనందంగా ఉందని, ఇదే స్ఫూర్తితో వచ్చే ఏడాది మరింత వైభవంగా ఉత్సవాలు జరుపుకొందామన్నారు. ప్రజలందరితో పండగ ఉత్సాహాన్ని పంచుకోవాలనే ఉద్దేశంతోనే డిగ్రీ కళాశాల మైదానంలో బాణాసంచా ప్రదర్శన, రావణదహనం ఏర్పాటు చేసి కుటుంబ సభ్యులతో కలసి హాజరయ్యామన్నారు. ఇది కేవలం ఆరంభమేనని, వచ్చే ఏడాది పెద్ద ఎత్తున నిర్వహించేలా మీ అందరి సహకారాలు ఉండాలన్నారు.

పండుగ సరుకుల పంపిణీ

నవాబుపేట: మండల కేంద్రంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పండుగ సరుకులు అందించారు. ఈ సందర్భంగా గురువారం మండల కేంద్రంలో 1836 కుటుంబాలకు పండగ సరుకులు అందించారు. కాగా దసరాకు సంబంధించి పదిరకాల వస్తువులతో కూడిన కిట్టును ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో వ్యాపార సంఘం మండల అధ్యక్షుడు సుధాకర్, గీతా, అంజయ్య, నిరంజన్, బబ్లు, నసీర్, చంద్ర, మశ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థిని ఉన్నత చదువుకు ఆర్థిక సాయం

చిన్నచింతకుంట: మండల కేంద్రానికి చెందిన విద్యార్థిని జొన రెచాల్ పైచదువుల నిమిత్తం శుక్రవారం దమగ్నాపురంలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి రూ.50వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థిని జొనల్ రేచాల్ ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చిన్నచింతకుంట గ్రామస్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు..

మదనాపురం మండలం దుప్పల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకులు పలువురు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సమక్షంలో దమగ్నాపురంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో దుప్పల్లి నాయకులు మహదేవన్‌గౌడ్‌తోపాటు పలువురు ఉన్నారు.



వేడుకలకు హాజరైన పట్టణవాసులు



రావణాసుర దహనం



హన్వాడలో భువనేశ్వరిమాత శోభాయాత్ర

అంబరాన్నంటిన దసరా సంబురాలు



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, జిల్లా ఎస్పీ జానకి

- డిగ్రీకళాశాలలో అట్టహాసంగా రావణదహనం
- వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, ఎస్పీ జానకి
- ఆకట్టుకున్న బాణాసంచా పేలుళ్లు

జడ్చర్ల టౌన్: దసరా వేడుకలు జడ్చర్లలో అంబరాన్నంటాయి. పట్టణంలోని డిగ్రీ కళాశాల మైదానంలో రావణాసుర దహనం కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. విద్యుత్ కాంతులతో కళాశాల మైదానం పట్టపగలుగా మారింది. విజయ దశమి పురస్కరించుకొని వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సహకారంతో వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని భాగ్యేశ్వరాలయం నుంచి ఊరేగింపుగా కళాశాల మైదానానికి తీసుకొచ్చారు. అక్కడ ఏర్పాటు చేసిన వేదికపై ఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. జమ్మిచెట్టు కొమ్మలను ఉంచి పూజ జరిపించారు. పూజలో కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే, ఎస్పీ జానకి పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా జమ్మిపూజ అనంతరం వేదికపైనే ఉన్న తన తల్లి శశికళ పాదాలకు ఎమ్మెల్యే నమస్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, వార్డు కౌన్సిలర్లు, నాయకులు, పట్టణవాసులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వీహెచ్‌పీ అధ్యక్షుడు అఖిల్‌రెడ్డి ఎస్పీ జానకి, ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులను సన్మానించారు.

ఆకట్టుకున్న రావణదహనం

దసరా వేడుకల్లో భాగంగా నిర్వహించిన రావణ దహనం కార్యక్రమం పట్టణవాసులను విశేషంగా ఆకట్టుకుంది. లేజర్ గన్‌ద్వారా ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి రావణదహనం చేశారు. ఈ సమయంలో ప్రజలు పెద్ద ఎత్తున హర్షాధ్వానాలు చేశారు. దహనం సందర్భంగా బాణాసంచా పేలుళ్లు విశేషంగా ఆకట్టుకున్నాయి. మైదానమంతా విద్యుద్దీపాలతో పట్టపగలును తలపించేలా తీర్చిదిద్దారు. ఇక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, కావేరమ్మపేట తోపాటు పలు ప్రాంతాలు, గ్రామాల్లోనూ శమీపూజ వైభవంగా జరిపించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకొన్నారు.

- చిన్నచింతకుంట మండలంలోని వివిధ గ్రామాల్లో సాయంత్రం గ్రామస్తులంతా కలిసి జమ్మిచెట్టు వద్దకు చేరి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.
- మిడ్జిల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన రావణకాష్టను ప్రజలు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో జడ్చర్ల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి అల్వాల్‌రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.
- దేవరకద్ర మున్సిపాలిటీతోపాటు వివిధ గ్రామాల్లో గురువారం సాయంత్రం శమీ వృక్షానికి ఘనంగా పూజలు నిర్వహించారు. మంగళతోరణాలతో ప్రతి ఇంటిని అలంకరించారు. పోచమ్మ ఆలయ సమీపంలోని రామ్‌లీలా మైదానంలో రావణాసురుని భారీ కటౌట్‌కు నిప్పంటించారు.
- భూత్పూర్ మున్సిపాలిటీతోపాటు మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం దసరా వేడుకలు భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. మండలంలోని అన్నాసాగర్‌లో దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని ఉన్నత పాఠశాలలో కాంగ్రెస్ పట్టణ శాఖ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్ ఆధ్వర్యంలో దసరా వేడుకలు జరుపుకున్నారు.



అన్నాసాగర్‌లో శమీ పూజ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



అడ్డాకుల ఠాణాలో ఆయిధపూజ చేస్తున్న ఎస్‌ఐ శ్రీనివాస్

- అడ్డాకుల, మూసాపేట మండలాల్లో దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాతను భక్తులు ఊరేగింపు చేపట్టారు. కోలాటాలు, బొడ్డెమ్మలు వేస్తూ ఆకట్టుకున్నారు. ఇదిలా ఉండగా పోలీస్ స్టేషన్లలో ఎస్‌ఐలు శ్రీనివాస్, వేణు ఆయుధపూజ చేశారు.
- రాజాపూర్ మండలంలోని తిర్మలాపూర్, మల్లేపల్లి, చొక్కంపేట్, ఈద్గాన్‌పల్లి, రాయపల్లి తదితర గ్రామాలతోపాటు బాలానగర్ మండల కేంద్రం, పెద్దరేవల్లి, చిన్నరేవల్లి, గౌతాపూర్, ఉడిత్యాలలో గురువారం దసరా సందర్భంగా శమీపూజ నిర్వహించి పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

– హన్వాడ మండల కేంద్రంలో ప్రతిష్ఠించిన దుర్గామాతను ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. శోభాయాత్రలో డీజె పాటలకు యువత కేరింతలు, యువతుల కోలాటాలతో బొడ్డెమ్మలు, వెరసి కిక్కిరిసిన జనం మధ్య సాగింది. మండలకేంద్రంలో భువనేశ్వరీదేవి ఆలయం చౌరస్తా వద్దకున్న శోభాయాత్ర చౌరస్తాలో రావణదహనం నిర్వహించారు. అనంతరం గ్రామ శివారులోని చెంద్రాయణగుట్టపై వెలిసిన లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం వద్దకు చేరుకుని శమీపూజ నిర్వహించారు.



శోభాయాత్రలో ప్రజల కోలాహలం



హాస్నాపూర్‌లో దుర్గామాత ఊరేగింపు



చొక్కంపేట్‌లో జమ్మిచెట్టుకు గ్రామస్తుల పూజలు



బతుకమ్మ వేడుకల్లో చిన్నారులు



పాలకొండలో బతుకమ్మలతో మహిళల ఊరేగింపు



దేవరకద్రలో శమీపూజలు నిర్వహిస్తున్న దృశ్యం

కనులపండువగా విజయయాత్ర



వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి అలంకరణ



విజయయాత్రలో పాల్గొన్న భక్తులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం బ్రాహ్మణవాడిలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో గురువారం విజయ దశమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారిని లలితా సుందరిదేవి రూపంలో అలంకరించారు. అనంతరం అమ్మవారికి అభిషేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. శుక్రవారం అమ్మవారు శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం రాత్రి బ్రాహ్మణవాడిలో అమ్మవారి విజయయాత్ర వైభవంగా నిర్వహించారు. వేడుకల చివరిరోజు అమ్మవారి ఉత్సవ వాహనాల ఊరేగింపును కనులపండువగా నిర్వహించారు. నవరాత్రి వేడుకల్లో అమ్మవారి వాహన సేవలను విజయయాత్రలో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు రాఘవేంద్రశర్మ, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వెంకటేశ్, కార్యదర్శి వేణుగోపాల్, కోశాధికారి నాగరాజు, ప్రమోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

విజయదశమిని పురస్కరించుకొని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి స్థానిక రేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు. మహమ్మదాబాద్ మండలంలోని నంచర్ల, గాధిర్యాల్, జూలపల్లి, చౌదర్‌పల్లి, మహమ్మదాబాద్‌లో చిన్నాపెద్ద ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. అమ్మవారి నిమజ్జనం సందర్భంగా ఆడపడుచులు బతుకమ్మ ఆడి సంబురపడ్డారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు యువతీ, యువకులు మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



మిడ్జిల్‌లో అమ్మవారిని ఊరేగిస్తున్న గ్రామస్తులు

- మిడ్జిల్ మండల కేంద్రంలో తొమ్మిది రోజులు ప్రత్యేక పూజలందుకున్న దుర్గా మాత ఉత్సవ విగ్రహాన్ని శుక్రవారం మండల కేంద్రంలోని ఈదమ్మ ఆలయం నుంచి పోలీస్‌స్టేషన్, బస్టాండ్, హనుమాన్ టెంపులు గుండా ఊరేగింపు నిర్వహించారు. గ్రామస్తులు పాల్గొని కోలాటాలు, నృత్యాలు చేశారు.

- నవాబుపేట మండల కేంద్రంలో చారిత్రాత్మక బురుజు వద్ద కాశాయ జెండాను ఎగరవేసి శివాలయంలో శమీపూజలు చేశారు. మైసమ్మ ఆలయం, కొల్లూర్, కూచూర్, యన్మన్‌గండ్ల, చౌడూర్, గురుకుంటలో శమీపూజలు చేశారు. అనంతరం ఒకరికొకరు పండగ శుభాకాంక్షలు తెలిపుకున్నారు. పదిరోజులపాటు జరిగిన శరన్నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం ప్రత్యేక పూజలతో ముగించారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. కాగా అమ్మవారు రాజరాజేశ్వరీదేవిగా ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.



నవాబుపేట శివాలయంలో శమీపూజ కార్యక్రమం



బండర్‌పల్లి చెక్‌డ్యామ్ నీటిలో దుర్గామాతను నిమజ్జనం చేస్తున్న నిర్వాహకులు

- దేవరకద్ర మున్సిపాలిటీలో శుక్రవారం అంగరంగ వైభవంగా దుర్గామాత శోభాయాత్ర నిర్వహించారు. ఈశ్వర వీరప్పయ్యస్వామి ఆలయం నుంచి ప్రారంభమైన ఊరేగింపు పట్టణంలోని తెలుగువాడ, దళితవాడ, కురుమవాడ, ఆర్వోబీ మీదుగా కొత్తబస్టాండ్ వరకు అక్కడి నుంచి కోయిల్‌సాగర్ రోడ్‌లో శోభాయాత్ర కొనసాగింది. అలాగే దళితవాడలో ప్రతిష్ఠించిన దుర్గామాతను ఊరేగింపు నిర్వహించారు. భారీ ఎత్తున కోలాట ప్రదర్శనలు, బతుకమ్మల ఆటలతో అలరించారు. చిన్నారుల కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి, రాత్రి 8గంటల వరకు శోభాయాత్ర కొనసాగింది. అనంతరం దుర్గామాతను కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో నిమజ్జనం చేశారు. మీనుగోనిపల్లిలో ప్రతిష్ఠించిన దుర్గామాతను ఊరేగించి బండర్‌పల్లి చెక్‌డ్యామ్‌లో నిమజ్జనం చేశారు.

అలరించిన శోభాయాత్ర



జడ్చర్లలోని వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాల ముగింపులో భాగంగా శుక్రవారం రాత్రి నిర్వహించిన శోభాయాత్ర అలరించింది. అమ్మవారి ఉత్సవవిగ్రహం రథంపై ప్రతిష్ఠించి ప్రధానవీధుల్లో ఊరేగించారు. ఆర్యవైశ్యులు పెద్ద ఎత్తున పాల్గొని నృత్యాలు చేస్తూ ముందుకు సాగారు.

అమ్మవారి నిమజ్జనం

నవాబుపేట: నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండల కేంద్రంలో కన్యకాపరమేశ్వరీ ఆలయలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహంతోపాటు మండలంలోని రుద్రారం, తీగలపల్లి, మరికల్‌లో అమ్మవారి ఊరేగింపులు కొనసాగాయి. శుక్రవారం శోభాయాత్ర కన్యకాపరమేశ్వరీ ఆలయం నుంచి కనులపండువగా నిర్వహించారు. అనంతరం పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు.

గాంధేయ మార్గంలోనే తెలంగాణ సాధన

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- మహాత్ముడికి ఘననివాళి



గడియారం చౌరస్తాలోని గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): గాంధేయ మార్గంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా గురువారం గడియారం చౌరస్తాలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంలో గాంధీజీ అనుసరించిన శాంతియుత విధానాలు ఇమిడి ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వెంకన్న, గణేశ్, శివరాజు, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

- ఎస్పీ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి ఎస్పీ జానకి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ సురేశ్‌కుమార్, ఆర్ఐలు పాల్గొన్నారు.
- స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ఆధ్వర్యంలో ఈనెల 2న విజయవాడలో జరిగిన స్వచ్ఛతన్-2025 10కిలోమీటర్ల పరుగు పోటీలో ఏఆర్ కానిస్టేబుల్ లింగన్న వెండి పతకంతోపాటు రూ.10వేల నగదు గెలుచుకున్నారు. ఏఆర్ కానిస్టేబుల్ లింగన్నను ఎస్పీ అభినందించారు.
- దేవరకద్ర మున్సిపాలిటీలోని పాత మండల పరిషత్ కార్యాలయం ఎదుట గాంధీ విగ్రహం వద్ద ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘం, వివిధ పార్టీల నాయకులు, దేవరకద్ర మున్సిపాలిటీ కార్యాలయం వద్ద గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.మున్సిపల్ కమిషనర్ సురేశ్‌బాబు, ఈవో సీత్యానాయక్, కాంగ్రెస్, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.
- భూత్పూర్ మున్సిపల్, తహసీల్దార్, ఎంపీడీఓ, జీపీ కార్యాలయాల్లో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నూరుల్ నజీబ్, సిబ్బంది, తహసీల్దార్ కిషన్, ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీదేవి, సిబ్బంది ఉన్నారు.
- అడ్డాకుల, మూసాపేట మండలాల్లో వివిధ రాజకీయ పార్టీల నాయకులు జాతిపిత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహాత్ముడి సేవలను పలువురు కొనియాడారు.
- మహమ్మదాబాద్ మండలంలోని ఆయా గ్రామాల్లో గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- చిన్నచింతకుంట, అల్లీపురం, మద్దూర్, అప్పంపల్లి, పర్దిపూరం, లాల్‌కోట, దమగ్నాపురం, నెల్లికొండి, ముచ్చింతలలో గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.



చిన్నచింతకుంటలో మహాత్ముడి విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు



గాధిర్యాల్‌లో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గ్రామస్తులు



దేవరకద్రలో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

పోరాట ఫలితంగానే వేతనాల పెంపు

నారాయణపేట టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా నైబర్ హుడ్ సెంటర్లలలో పని చేస్తున్న సిబ్బందికి వేతనాలు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం పట్ల దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం కమిటీ ప్రధాన కార్యదర్శి కాశప్ప మాట్లాడుతూ.. వేతనాల పెంపు హెచ్‌ఆర్ పాలసీ అమలు కోసం, రెగ్యులరైజ్ చేయాలని 2024 నుంచి ఎన్‌పీఆర్‌డీ ఆధ్వర్యంలో దశల వారిగా ఆందోళన, పోరాటాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోరాటాల ఫలితంగానే ఎస్ఈఆర్‌పీలో పనిచేస్తున్న సిబ్బందిని రెగ్యులరైజ్ చేసి వేతనాలు పెంచింది. కానీ ఎన్‌హెచ్‌సీలలో పనిచేస్తున్న సిబ్బందిని పట్టించుకోలేదు. ఎన్‌పీఆర్‌డీ జిల్లా సహాయ కార్యదర్శులు బాలరాజు, బస్వరాజ్ పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవించిన గర్భిణులు

మాగనూర్: అంబులెన్స్‌లో వేరు వేరు సమయాల్లో ఇద్దరు మహిళలు ప్రసవించారు. మొదట కృష్ణ మండలం కూసుమూర్తి గ్రామానికి చెందిన భీమ్‌బాయ్ గర్భిణిని మాగనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. అలాగే మాగనూర్ మండలం కోల్పూర్ గ్రామానిక చెందిన అశ్వినికు నెలలు నిండటంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మధ్యలో ప్రసవించింది. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నట్లు వైద్యసిబ్బంది తెలిపారు.

పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని రాజేంద్ర నగర్ యువజన సంఘం నాయకులు శ్రీనివాస్‌రాజు అన్నారు. దసరా పండుగ సందర్భంగా గురువారం రాజేంద్రనగర్‌లో రాజేంద్రనగర్ యువజన సంఘం పతకాన్ని ఆవిష్కరించారు. ప్రతి సంవత్సరం దసరా రోజు తమ యువజన సంఘం పతకాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యువజన సంఘం నాయకులు నాగరాజు, సతీశ్, కిశోర్‌ముదిరాజ్, కృష్ణమూర్తి, జ్ఞానేశ్వర్, భాను, విశ్వం, రాజారెడ్డి, రాకేశ్, శ్రీరామ్‌గౌడ్, సురేశ్, నగేశ్, సంతోష్ పాల్గొన్నారు.



పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

తవ్వారు.. వదిలేశారు!



రాజాపూర్: మండల కేంద్రంలో జాతీయ రహదారి నుంచి పీహెచ్‌సీకి వెళ్లే రోడ్డులో గుంతను తీసి వదిలేశారు. దీంతో ఆ రోడ్డులో వెళ్లే వాహనదారులు, గ్రామాల నుంచి ఆస్పత్రికి వైద్యానికి వచ్చేవారు తీసిన గుంతను పూడ్చి వేయకపోవడంతో వామ్మో గుంత అంటూ జంకుతున్నారు. నీటిగుంతలో పడి చిన్నారి మృతి అంటూ తరచూ పత్రికలు, టీవిల్లో చూస్తూనే ఉంటాం.. ఇలాంటి ప్రమాదాలు జరగముందే ప్రమాదకర గుంతను పూడ్చివేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. గతంలో ఇదే రోడ్డుపై మురుగు పారుతుండగా.. మురుగు రోడ్డు మీదకు రాకుండా తీసిన గుంతలో ఓ బాలుడు పడి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది.